ప్రజాశక్తి

గురువారం 18 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

రిజిస్ట్రేషన్లపై యూజర్ ఛార్జీల ఎఫెక్ట్ !

◆ భూ రీ సర్వే కూడా కారణం

◆ విశాఖ జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్‌ల ద్వారా మూడేళ్లలో లావాదేవీలు 2,15,512 ◆ విలువ : 2529.42 కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంలో గడిచిన మూడేళ్లలో కాస్త హెచ్చుతగ్గులున్నా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న యూజర్ ఛార్జీల ప్రభావంతో రిజిస్ట్రేషన్లు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం ఒక రిజిస్ట్రేషన్‌కు యూజర్ ఛార్జీ రూ.200 వసూలు చేస్తుండగా దీన్ని రూ.500కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అంతేగాకుండా 10 పేజీల వరకే ఈ రూ.500 విధానం అమలుకానుంది. తర్వాత ప్రతి పేజీకి అదనంగా రూ.10 చొప్పున యూజర్ ఛార్జీ పడనుంది. దీంతో రిజిస్ట్రేషన్లపై నెగెటివ్ ప్రభావం పడుతుందని ఆ శాఖతో సంబంధం ఉన్న నిపుణులు చెబుతున్నారు.

9 ఎస్ఆర్‌ల ద్వారా రిజిస్ట్రేషన్లు

విశాఖ జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా గడిచిన మూడేళ్ల వరకూ మొత్తం 2 లక్షలా 15 వేలా 512 డాక్యుమెంట్లు రిజిస్టర్ జరగ్గా వచ్చిన ఆదాయం రూ.2529.42 కోట్లుగా ఉంది. మొత్తంగా చూసినప్పుడు 2020-21 సంవత్సరంలో కొంతమేరకు 'రాజధాని' ప్రభావం ప్రస్ఫుటంగా కనిపించింది. ఆ సంవత్సరం తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 62,528 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరగ్గా రూ.718.42 కోట్ల రెవెన్యూ వచ్చింది.

ప్రభుత్వ భూమి విలువ పెరిగిందా ?

విశాఖ జిల్లాలో ముఖ్యంగా నగరంలో ఎక్కడా ప్రభుత్వ భూమి విలువ మాత్రం పెరగలేదన్నది స్పష్టంగా తెలుస్తోంది. ప్రైవేట్ భూమికి రియల్టర్ల ప్రభావంతో మాత్రం రెండింతలు మూడింతలుగా కాళ్లు వచ్చాయి. అయితే గడిచిన ఏడాది కాలంగా రియల్ ఎస్టేట్ ఊపు కూడా తగ్గిందని రియల్ ఎస్టేట్ యజమానులు చెబుతున్నారు. ఇళ్ల స్థలాలు, అలాగే ఇల్లు (ఫ్లాట్)లకు సంబంధించిన వ్యాపార లావాదేవీలన్నీ అంత సజావుగా సాగకపోవడంతో ఎంవివి.సత్యనారాయణ లాంటి పేరు గాంచిన రియల్ ఎస్టేట్ అధిపతి కూడా ఎంవివి ఫ్లాట్ల సేల్ అంటూ బోర్డులు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

యూజర్ ఛార్జీలతో పాటు భూముల రీసర్వే కూడా..

వాస్తవానికి గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రారంభించడంతో పక్కాగా లేని డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేసినట్లు భోగట్టా. కొత్తగా భూ సర్వే కోసం తయారు చేసిన నిబంధనలు కూడా రిజిస్ట్రేషన్లకు ఆటంకంగా మారాయని తెలుస్తోంది. ఏదేమైనా గతంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో రాజధాని అంటూ అందుకున్న నినాదంతో విశాఖలో భూ లావాదేవీలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. తాజాగా ఆ స్థితి లేదు. దీంతో రిజిస్ట్రేషన్లపైనా 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ మాట్లాడుతున్న చంద్రబాబు

బాబు పర్యటనతో టిడిపిలో జోష్

ఎక్కడికక్కడ అధినేతకు ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు

ప్రజాశక్తి - పెందుర్తి : విశాఖలో చంద్రబాబు పర్యటన తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు బాబు బుధవారం విశాఖకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి పెందుర్తి వరకూ ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఎక్కడికక్కడ టిడిపి నేతలు గజమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీ మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ మూర్తి, చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా నాయకులు పీలా శ్రీనివాసరావు, వసంత, బల్లా శ్రీనివాసరావు తదితరులు చంద్రబాబు వెంట ఉన్నారు.

చంద్రబాబు పర్యటన గోపాలపట్నం, వేపగుంట, చినముషిడివాడల మీదుగా సాగింది. రోడ్‌షోలకు జనం తరలి వచ్చారు. పెందుర్తిలో ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. రాజకీయంగా టిడిపిని ఉత్తరాంధ్ర ఎల్లవేళలా ఆధరించిందన్నారు. విశాఖను హుదూద్ సమయంలో తాను ఎలా కాపాడిందీ వివరించారు. ప్రజలకు నాడు టిడిపి ప్రభుత్వం ఏం చేసిందో గుర్తు చేశారు. జగన్ పాలన వల్ల అందరిలో అభద్రత నెలకొందని తెలిపారు. ప్రశాంత విశాఖలో నేడు అరాచకాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం మిగతా 2లో..

హయగ్రీవ ఇన్‌ఫ్రాపై ఐటి దాడులు

▶ వార్త 2లో..

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

▶ వార్త 2లో..

పోర్టు కంటైనర్ లారీల అడ్డగింత

▶ వార్త 2లో..

పరీక్షా ఏర్పాట్లుపై సమీక్ష నిర్వహిస్తున్న జెసి విశ్వనాథన్

యుపిఎస్‌సి పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28న జిల్లాలో జరగబోయే యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం యుపిఎస్‌సి పరీక్ష నిర్వహణపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న జరుగనున్న యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్షకు విశాఖ జిల్లాలో మొత్తం 29 సెంటర్లలో 10,865 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. రెండు జోన్లలో మిగతా 2లో..

సుర్రుమంటున్న సూర్యుడు

నగర వీధులన్నీ నిర్మానుష్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నాలుగు రోజులుగా ఎండలు సుర్రుమంటున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటినా వేడి గాలుల తీవ్రత కొనసాగుతోంది. ఈ పరిస్థితులు నగరవాసులను ఠారెత్తిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పుల కారణంగా జనం ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టడానికి భయపడుతున్నారు. ఇది చాలదన్నట్లు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరంలో జనసంచారం బాగా తగ్గింది. దీంతో నగరంలోని అన్ని రహదారులూ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మోకా తుపాను కారణంగా గాలిలో తేమ ఆవిరయ్యింది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు 4 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదు అవుతున్నాయి. మరో రెండు

నగరంలో నిర్మానుష్యంగా మారిన ఓ రహదారి

రోజులపాటు ఎండలు పెరిగి వడగాల్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం ఎయిర్ పోర్టులో 39.5 డిగ్రీల సెల్సియస్ నమోదు అయింది. మంగళవారం ఇది 40 డిగ్రీలు పైమాటే.

వివాహాల సీజన్ కావడంతో ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోలేక, కొందరు బస్సుల్లో, మరికొందరు అద్దె కార్లలో వెళుతున్నారు. బయట వాతావరణం వేడెక్కడంతో, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సుర్రుమంటున్న సూర్యుడు

వాహనాల్లో ఏసీలు పనిచేయక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. టైర్లు వేడెక్కడంతో పేలిపోతాయన్న భయం వాహన చోదకుల్లో కనిపిస్తోంది. మరోవైపు ఎండలు మండిపోతుండడంతో విద్యుత్ వాడకం విపరీతంగా పెరిగింది. నిర్దేశించిన కోటాకు మించి విద్యుత్తు వినియోగం జరుగుతోందని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఎంవిపి.కాలనీ : జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జివిఎంసి ఆధ్వర్యంలో 124 చోట్ల చలి వేంద్రాలు ఏర్పాటు చేసి, మంచినీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ పరిధిలో చలివేంద్రం, విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో మజ్జిగ అందజేస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా సోమవారం స్పందన అర్జీదారులకు భోజన సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రత వల్ల ఏవిధమైన ప్రాణ నష్టమూ జరగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎండల ప్రభావం వల్ల కలిగే ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎక్కువ అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు వీలైనంత మేర పగటిపూట ఇంటివద్దనే గడపాలని, అత్యవసర పనులకు మాత్రమే బయటకు రావాలని కోరారు. వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటి వద్దనే ఉండేటట్లు చూడాలని అన్నారు. పారిశుధ్య సిబ్బందికి అవసరమైన మంచినీరు, మజ్జిగ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు బయటకు వెళ్లే ముందు వడదెబ్బ తగలకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని కోరారు.

యుపిఎస్‌సి పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

జరుగుతున్న పరీక్షలకు భీమిలి, విశాఖపట్నం ఆర్‌డిఒలు జోనల్ అధికారులుగా ఉంటారన్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష జరిగే ఒక గంట ముందుగా మాత్రమే పరీక్షా కేంద్రం తెరవబడుతుందని, అనంతరం పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశ అనుమతి ఉంటుందని అన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించబోమని అన్నారు. ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి అనుమతించాలన్నారు. వెన్యూ సూపర్‌వైజర్లు పరీక్ష నిర్వహించే మూడు రోజుల ముందు అన్ని పరీక్షా కేంద్రాలనూ తనిఖీ చేసి ప్రతి ఒక్క పరీక్ష హాలులో గోడ గడియారం అమర్చాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అదనంగా రెండు రూములు సిద్ధం చేసి ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకొనేలా సరిపోయే ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచినీరు సదుపాయం ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలని ఎపిఇపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈశ్వరరావు, విద్యుత్, ఆర్‌టిసి, జివిఎంసి, పోలీస్, రెవెన్యూ, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాబు పర్యటనతో టిడిపిలో జోష్

చేశారు. జగన్ హయాంలో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. పంచ గ్రామాల సమస్యను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామన్నారు.

విశాఖపట్నం - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మహబూబ్‌నగర్ స్టేషన్ వరకు పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు 12861 విశాఖపట్నం-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలు మే 20 నుండి మహబూబ్‌నగర్ వరకు పొడిగించబడుతుంది, విశాఖపట్నం నుంచి సాయంత్రం 18.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 06:45 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది 06:55 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి ఉదయం 09.20 గంటలకు మహబూబ్ నగర్ చేరుకుంటుంది. తిరుగు దిశలో రైలు నెంబరు 12862 మహబూబ్‌నగర్-కాచిగూడ -విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ మే 20 నుంచి మహబూబ్‌నగర్ నుంచి సాయంత్రం 16.10 గంటలకు బయలుదేరి 18.10 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. అక్కడి నుండి 18.20 గంటలకు బయలుదేరి ఉదయం 06.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

పోర్టు కంటైనర్ లారీల అడ్డగింత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోర్టు నుంచి విసిటిపిల్ కంటైనర్ లారీలు వెళ్లకుండా చూడాలని డిమాండ్ చేస్తూ 39వ వార్డు కోట వీధి మదీనా దర్గా వద్ద ఆ ప్రాంతం ప్రజలు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కంటైనర్ లారీల రాకపోకలు వల్ల గాలి, శబ్ద కాలుష్యం అధికంగా ఉంటోందని మండిపడ్డారు. అధిక లోడుతో ఇవి నడుస్తున్నందున జివిఎంసికి చెందిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని తెలిపారు. అలాగే కంటైనర్ లారీలను నడవకుండా చూడాలని 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ డిమాండ్ చేశారు.సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పోర్టు అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.

హయగ్రీవ ఇన్‌ఫ్రాపై ఐటి దాడులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖలోని హయగ్రీవ ఇన్ఫ్రాటెక్ కంపెనీలో బుధవారం రాత్రి ఐటి సోదాలు జరిగాయి. ఆదాయపు పన్ను శాఖ విశాఖలోని హయగ్రీవా అధినేత జగదీశ్వరుడి నిధుల వ్యవహారంపై ఇటీవల హైదరాబాద్‌లో నవయుగ కంపెనీలో ఐటి సోదలానంతరం దొరికిన లింక్‌తో దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఎంవిపి.కాలనీలోని కార్యాలయంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. 2019 ఎన్నికల్లో జరిగిన 100 కోట్ల ఆర్థిక లావాదేవీలు, వాటికి సంబంధించిన కేసులో సోదాలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. హయగ్రీవ మేనేజింగ్ డైరెక్టర్ జగదీశ్వరుడు పలు అక్రమార్జనలు, మోసాలకు పాల్పడుతున్నారని ఢిల్లీ వరకూ అనేక పిర్యాదులు 2001 సంవత్సరం నుంచి ఉన్నాయి. ఆయనతో పాటు పున్నం నారాయణరావు, రాధారాణి చిలుకూరి, అడిషనల్ డెరైక్టర్ నారాయణ శ్రీనివాస్ మూర్తి, ఇంద్ర కుమార్ చితూరి, నారాయణరావు గున్నం ఇళ్లలోనూ ఆదాయపన్ను సోదాలు కొనసాగుతున్నాయి.

వాతావరణ ప్రభావం విశాఖపై అధికం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శనివారం ఆమె నోవోటెల్‌లో వాతావరణం మార్పుపై జరిగిన వర్క్‌షాపులో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగరంపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంటోందని, ముఖ్యంగా విశాఖతీర ప్రాంతంతో పాటు పారిశ్రామిక నగరం అవడం వల్ల వాతావరణంలో మార్పులు ఉంటాయని తెలిపారు. విశాఖ నగరంలో వాతావరణం మార్పు కోసం అనేక ప్రాజెక్టులు చేపడుతున్నామని, అందులో భాగంగా సోలార్ ఎనర్జీ, ఎల్ఇడి స్ట్రీట్ లైట్, విద్యుత్ వాహనాలు, నీటి ప్రాజెక్టుల వినియోగం ద్వారా గాలిలో కార్బన్‌డయాక్సైడ్‌ను తగ్గించుకోగలిగామని తెలిపారు. అనంతరం జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ విశాఖ నగరానికి విశాలమైన తీర ప్రాంతం ఉందని, అందువల్ల అధికంగా తుపానుల ప్రభావం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇనిస్టిట్యూట్ సీనియర్ డైరెక్టర్ సంజయ్ సెత్, యునైటెడ్ నేషనల్ యూనివర్సిటీ జర్మనీ, అసిస్టెంట్ అకడమిక్ అధికారి డాక్టర్ హిమాన్సు శేఖర్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ రత్ బాబు, జివిఎంసి పర్యవేక్షణ ఇంజినీర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాపులో పాల్గొన్న జివిఎంసి మేయర్, కమిషనర్

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రశంసించారు. బుధవారం ఉదయం మహారాణిపేటలోని రెడ్‌క్రాస్ భవనంలో ఉన్న సమావేశ మందిరంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ హోదాలో ఆయన హాజరయ్యారు. తొలుత సంస్థ స్థాపకులు హెన్రీ డునాన్ట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్ క్రాస్ సంస్థ వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలను ఉచిత వైద్య సేవలు, రక్తదానం ద్వారా ఎంతగానో ఆదుకుంటోందన్నారు. గత మూడు సంవత్సరాలలో రెడ్‌క్రాస్ సొసైటీ వారు అందించిన సేవలను, ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి సమయంలో నిర్వహించిన ప్రత్యేక బహుళ ప్రయోజన ఆరోగ్య శిబిరాలను గవర్నర్ అభినందించారని, అందుకుగాను ఆయన చేతులమీదుగా విశాఖ జిల్లా తరపున అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్త మార్పిడి చేసి మందులతో పాటు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శివ నాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న కలెక్టర్ మల్లికార్జునను అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కోవిడ్, ఇతర విపత్తులలో ప్రజలకు సేవలందించిన విష్ణువర్ధన్ రెడ్డి, కనక లింగశ్వరరావు, రెహమతుల్లా, లక్ష్మీకాంతంలకు, పేదవారికి ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమంలో చేయూత అందించిన ధన్విత ఫౌండేషన్ వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు. వివిధ సేవల్లో ప్రతిభ కనబరిచిన విశాఖ వుమెన్స్ డిగ్రీ కాలేజ్ ఉపాధ్యాయురాలు జి.జ్యోతి, జాతీయ స్థాయి బెస్ట్ యూత్ అవార్డు అందుకున్న ఎస్.సుభాష్‌ను ప్రశంసించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ పి.రవికుమార్, సమాచార శాఖ ఉప సంచాలకులు వి.మణిరామ్, రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ఎయులో ఉన్నత విద్యాశాఖాధికారి ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జె.శ్యామలరావు అన్నారు. బుధవారం ఉదయం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ క్యాంపస్‌లో చేరిన ప్రతి విద్యార్థికీ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించే విధంగా అన్ని కోర్సుల్లో మార్పులు చేసి అందిస్తున్న విధానం బాగుందన్నారు. దీని ఫలితంగా 3600 ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ఆర్ట్స్, సైన్స్ కళాశాలల విద్యార్థులకు సైతం మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ కల్చర్‌ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. వందకుపైగా స్టార్టప్‌లు వర్సిటీ క్యాంపస్‌లో పనిచేయడం మంచి పరిణామమన్నారు. ఇతర విద్యార్థులు దీని నుంచి స్ఫూర్తిని పొంది, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా మారడానికి అవకాశం ఉంటుందన్నారు. నాడు - నేడు స్ఫూర్తితో వర్సిటీ భవనాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు, ఆధునికీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శ్యామలరావుకు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అధికారులు, డీన్‌లు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ మత్స్యకార భరోసా పెద్ద బూటకం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైఎస్‌ఆర్ మత్స్యకార భరోసా పథకం పెద్ద బూటకమని జనసేన మత్స్యకార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మూగి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల అభివృద్ధి కోసం కేవలం రూ.500 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించడం అన్యాయమన్నారు. స్థానిక మత్స్యకార ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఇంతవరకూ మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీలో ఒక్కసారి కూడా చర్చించలేదని ఆరోపించారు.

విరిగిన పలకలతో ఇక్కట్లు

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు రహదారికిరువైపులా సబ్-వే పక్కన కాలువల మీద నిర్మించిన ఫుట్‌పాత్ పలకలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చాలాచోట్ల పైకప్పులు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సబ్-వే కాలువలపై వేసిన పలకలు పలుచోట్ల విరిగి ధ్వంసం కావడం, కొన్నిచోట్ల పూర్తిగా లేకపోవడంతో రాకపోకల సమయంలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా కాలువలో పడి గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా మధురవాడ బస్టాప్ నుంచి నగరంపాలెం రోడ్డు వరకు ఫుట్ పాత్ మీద పలకలు పూర్తిగా ఊడిపోయాయి. జివిఎంసి ఎదురుగా ఉన్న మద్యం దుకాణం సమీపంలో ఫుట్‌పాత్‌లు మరింత ప్రమాదకరంగా మారాయి. చంద్రంపాలెం, దుర్గానగర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, జాతరపార్క్ దగ్గర సబ్- వే పై పలకలు పూర్తిగా పడిపోయాయి. నిత్యం సందర్శకుల తాకిడి ఉండే శిల్పారామం వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. కొమ్మాది కూడలి నుంచి కార్ షెడ్ వరకు ఫుట్‌పాత్‌ను విద్యార్థులు నడక మార్గంగా ఉపయోగిస్తుంటారు. జోనల్ కార్యాలయం, జిల్లా పరిషత్ హైస్కూల్, మధురవాడ మార్కెట్, రైతుబజార్ మార్గాలు కూడా ఈ ఫుట్‌పాత్ మార్గంలోనే ఉన్నాయి. డ్రైనేజీ పైకప్పులు లేక పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఫుట్‌పాత్‌లపై పలకలు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

డ్రెయినేజీలపై విరిగిన పలకలు

నేరాలు ఘోరాలు

రెండు ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో బుధవారం వాకపాడు గ్రామం నుండి రాయ వరానికి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తహసిల్దారు శ్యాం కుమార్ సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. అంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి లేనిదే ఎవరైనా గ్రావెల్ మట్టి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సారా స్వాధీనం

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం పి.పొన్నవోలు శివారు ఆర్.కొత్తూరు గ్రామ సమీపంలో తరలించేందుకు సిద్ధం చేసిన సుమారు 60 లీటర్లు నాటు సారాతో పాటు బైకును బుధవారం స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్సై విభూషణరావు తెలిపారు. 60 లీటర్ల సారాను పల్సర్ బైక్ పై తరలిస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించగా గుర్తు తెలియని వ్యక్తి పరారీ కాగా రెండు ప్లాస్టిక్ కేనాలతో సారా తో పాటు బైక్ ను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో డిప్యూటీ డిఇఒ గౌరీశంకర్

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఉపాధ్యాయులకు జిల్లా ఉప విద్యా శాఖాధికారి గౌరిశంకర్ సూచించారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటుచేసిన వృత్యంతర శిక్షణలో భాగంగా బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారని, త్వరలో ప్రతి తరగతి గదిలో ఇన్ఫ్రాక్టివ్ పానల్స్ అందజేయనున్నట్లు వివరించారు. స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు త్రినాథరావు మాట్లాడుతూ, 'విద్యార్థులను భావి భారత పౌరులుగా ఎలా తీర్చిదిద్దాలి' అనే అంశంపై వివరించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ టిఎస్‌వి ప్రసాదరావు, బలరామమూర్తి, మధుమతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఒత్తిడి వద్దు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, చదువు పరంగా విద్యార్థులపై ఏ విధమైన ఒత్తిడి తేవొద్దని ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.ఉషారాణితో కలిసి ఆయన స్థానికంగా ఉన్న తిరుమల, శశి విద్యా సంస్థలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. తరగతి గదులు, వసతి సదుపాయం, వంట గదులు తదితరాలను పరిశీలించారు. ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని, ఫీజులపై తల్లిదండ్రులతో మాత్రమే చర్చించాలని స్పష్టం చేశారు. మానసిక నిపుణులను తప్పనిసరిగా నియమించాలన్నారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహించరాదని, సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని, ఫీజులు, సెలవులు, పరీక్షల విషయాల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్కడే ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు పలు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యా సంస్థల ప్రతినిధులు మూర్తి, సత్యనారాయణ, మృత్యుంజయరావు, శశి విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.క్రాంతిసుధ, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిరంజీవిరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక ది సెడార్ పాఠశాలలో బుధవారం ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. 3(ఎ) నావెల్ యూనిట్ ఎన్‌సిసి ఆధ్వర్యాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో 3(ఎ) నావెల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ ఇంగ్లీశ్వర్, ఆఫీస్ సిఐ ఈశ్వరరావు, నేవీ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎన్‌సిసి ఎఎన్ఒ పి.ఈశ్వర్ పాల్గొన్నారు.

జూలో జిరాఫీ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతుప్రదర్శనశాలలో దాదాపు మే అనే పేరుగల పదేళ్ల ఆడ జిరాఫీ బుధవారం మృతి చెందింది. మూడు నెలలుగా క్రానిక్ మెట్రిటిస్, న్యూమోనియా వ్యాధితో బాధపడుతున్న జిరాఫీకి జూ వైద్యులు చికిత్స అందించినట్లు క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. రెండు మూడు వారాలుగా జిరాఫీ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ వచ్చిందన్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. 2013లో నాలుగు నెల జిరాఫీని మలేషియాలోని నెగెరా జూ పార్కు నుంచి ఇక్కడకు తీసుకొచ్చినట్లు వివరించారు.

అప్పన్న సన్నిధిలో ఐఎఎస్ అధికారి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు సాదరంగా స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధి లోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ప్రసాదాన్ని అందించారు.

కృష్ణంరాజుపేటలో బడి బాట

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో బుధవారం జగనన్న బడి బాట నిర్వహించారు. ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

2న విద్యుత్ ఉద్యోగుల సహకార సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-వేపగుంట : సింహాచలం ఎలక్ట్రికల్ ఎపి ట్రాన్స్‌కో, ఎపి జెన్‌కో, ఎపిఇపిడిసిఎల్ ఉద్యోగుల సహకార పొదుపు, పరపతి సంఘం ఎన్నికలు జూన్ 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి వి.సతీష్‌రాజు తెలిపారు. తొమ్మిది మంది డైరెక్టర్ల కోసం ఈ నెల 24న నామినేషన్లు, 25న స్క్రూటినీ, 26వ తేదీన విత్‌డ్రాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరపతి సంఘం కార్యాలయంలో నామినేషన్లు వేయాలని సూచించారు.

బోధనలో పోటీతత్వంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-పద్మనాభం : బోధనలో పోటీతత్వం ఉంటే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎంపిపి కంటుబోతు రాంబాబు అన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన 45 మంది జిల్లా పరిషత్, కెజిబివి పాఠశాలల విద్యార్థులకు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎంఇఒ శివరాణి ఆధ్వర్యాన విద్యార్థులను ఎంపిపి సన్మానించి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఒక లక్ష్యంతో చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా ప్రాతిపదికన 82 శాతం సాధిస్తే పద్మనాభం మండలం 90.8 శాతంతో ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ నూతన విద్యా సంవత్సరంలో అంచనాకు మించి అడ్మిషన్లు సాధించాలన్నారు. ప్రయవేటు పాఠశాలలు మాదిరిగా ప్రభుత్వ పాఠశాలలు ఫలితాలను ఫ్లెక్సీలు పెట్టి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమములో జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, వి.శంకరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు బోని సన్యాసినాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయకుమార్, తహశీల్దార్ తోట శ్రీవల్లీ, వైస్ ఎంపిపి ఈర్ల రాజేశ్వరి, ఎంపిటిసి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంపిపి తదితరులు

టెలీ కమ్యూనికేషన్ రంగం కీలకం

సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి -తగరపువలస : దైనందిన జీవితంలో టెలీ కమ్యూనికేషన్ రంగం కీలకమని టెలీ కమ్యూనికేషన్ రంగ నిపుణులు ఎ.శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టెలీ కమ్యునికేషన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ, టెలీ కమ్యూనికేషన్ రంగంలో జరిగే పురోగతిని వివరించారు. ఇండియన్ స్టూడెంట్స్ ఫోరం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీర్స్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఇసి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాసులు, ఐఇటిఇ కార్యదర్శి వినయ్, ఐఎస్ఎఫ్ కౌన్సెలర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడారు.

బస్ కాంప్లెక్స్ సరే... షెల్టర్ మాటేమిటి?

టిడిపి నేత పిట్టా సురేష్

మాట్లాడుతున్న పిట్టా సురేష్

ప్రజాశక్తి -తగరపువలస : ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తగరపువలసలో ఏళ్లు గడుస్తున్నా సరే ఆర్‌టిసి బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు చేయలేదని, కాంప్లెక్స్ విషయం కాసేపు పక్కన పెడితే, కనీసం బస్ షెల్టర్ కూడా లేని పరిస్థితి ఉండటం విచారకరమని టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి నుంచి కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రోజూ విశాఖ వెళ్తూ, వస్తుంటారని పేర్కొన్నారు. షెల్టర్ లేక పోవడంతో బస్సుల కోసం ఎండలోనే నిరీక్షించి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సమస్య ప్రాధాన్యతను గుర్తించి త్వరలోనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను కోరారు. వెంటనే గ్రీన్ షెల్టర్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

అధికారులకు సూచనలిస్తున్న ఎసిపి వెంకటేశ్వర్లు

బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులపై దృష్టి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్ 3 పరిధిలో ఉన్న బిపిఎస్, ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను జూన్ 30వ తేదీ లోపు పూర్తిచేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు జోన్ 3 ఎసిపి వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీచేశారు. బుధవారం జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిపిఒ వినయ్‌ప్రసాద్, టిపిఎస్ తేజ, టిపిబిఒ అనిత, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

యుఎల్‌సి సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి -కంచరపాలెం : అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) మిగులు భూములు 22 - ఎ -1 డి సమస్యల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ 53వ వార్డు పరిధి మసీదు వీధి సచివాలయంలో ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, గోపాలపట్నం తహశీల్దార్ కొర్ర జయ, స్థానికులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం యుఎల్‌సికి సంబంధించి కొత్తగా జిఒ 84 తెచ్చినట్లు తెలిపారు. దీని వల్ల భూ హక్కుదారులకు స్లాబ్ విధానం ద్వారా రిజిస్ట్రేషన్, యుఎల్‌సి భూములలో ఇల్లు కట్టుకున్న వారికి గతంలో ఇచ్చిన జిఒల్లో ఫీజులు అధికంగా ఉన్నందున ప్రస్తుతం స్లాబ్ సిస్టం ద్వారా కన్వేయన్స్ డీడ్ పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. 150 గజాల వరకు డి.పట్టా కల్పించి పదేళ్ల తర్వాత పూర్తి హక్కులు అప్పగిస్తారని తెలిపారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు 15 శాతం కన్వేయన్స్ ఫీజు, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 చదరపు గజాలకు పైబడి ఉన్న స్థలాల్లో 100 శాతం కన్వేయన్స్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న దరఖాస్తుదారులు సచివాలయంలో అప్లికేషన్ పొందాలని సూచించారు. ఈ అవకాశం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉంటుందని వెల్లడించారు.

అగనంపూడిని సందర్శించిన పర్యావరణ అధికారులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాలుష్య సమస్యపై స్థానిక ప్రజా సంఘాలు ఇచ్చిన ఫిర్యాదుపై పర్యావరణ అధికారులు బుధవారం అగనంపూడిని సందర్శించారు. పర్యావరణ అధికారి ఆర్.చంద్రశేఖర్‌తో కలిసి ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, అగనంపూడి హార్టికల్చర్ సొసైటీ అధ్యక్షులు నెల్లి శ్రీనివాసరావు అగనంపూడి టోల్ ప్లాజా నుంచి హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఇసుక డిపో, ఫార్మాసిటీ వరకు సందర్శించారు. రోడ్డు పక్కనే మేటలు, బొగ్గు దూళితో నిండిన మొక్కల ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. అగనంపూడి సెంటర్‌లో శివరామ స్వీట్ షాపు ప్రతినిధి గుల్లల నవీన్ కుమార్‌ను బొగ్గు లారీలపై ఆరా తీశారు. రోజుకు సుమారు 100 బొగ్గు లారీలు వెళుతుంటాయని, వాటిపై సరిగా కవర్లు వేయకపోవడంతో బొగ్గు దూళి షాపుల్లోకి వస్తోందని వివరించారు. తర్వాత ఇసుక డిపో వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇసుక దారిలో నీరు చల్లకుండా గ్రౌండ్ చుట్టూ ఎటువంటి టార్పాలు లేకుండా ఉండటాన్ని గమనించారు. లారీలు, ట్రాక్టర్లపై ఓవర్ లోడ్ వేస్తూ వాటిపై సరైన టార్పాలు లేకుండా ఉండటం చూసి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఫార్మాసిటీలోకి వెళ్లి పొల్యూషన్ పేరామీటర్స్ రీడింగ్ తీసుకున్నారు. అవి పొల్యూషన్ శాతం అధికంగా చూపడంతో రికార్డ్ చేశారు. సందర్శన అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ, పర్యావరణ ఉన్నతాధికారులకు స్థానిక ప్రజా సంఘాలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. ఇక్కడ పరిశీలించిన విషయాలను విశాఖ జిల్లా పర్యావరణ ఇంజినీర్ ఎస్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్తామని, ఆయన సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

రైల్వే రహదారిలో రాకపోకలు బంద్ సరికాదు

ప్రజాశక్తి -కంచరపాలెం : రైల్వే క్వార్టర్ల రహదారిలో రాకపోకలను నిలిపేయడం సరికాదని ఉత్తర వైసిపి సమన్వయకర్త కెకె.రాజు వద్ద మొహిద్దీన్ గార్డెన్స్ ప్రజలు వాపోయారు. 53వ వార్డు పరిధి రాణాప్రతాప్‌నగర్, మొహిద్దీన్ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వచ్చిన కెకె.రాజు దృష్టికి రహదారి సమస్యను స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన కెకె.రాజు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. జెసి స్పందించి ఘటలా స్థలానికి చేరుకుని స్థానిక ప్రజలతో మాట్లాడారు. రైల్వే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : విశాఖ పర్యటనలో భాగంగా విశాఖ వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గోపాలపట్నంలో భారీ ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యాన తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తనపై చూపించిన ఆదరాభిమానాలు గణబాబుపై చూపించి అఖండ విజయాన్ని సమకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, గల్లా చిన్న, శరగడం రాజశేఖర్, నాయకులు పొలిమేర సీతారాం, నందవరపు సోములు, నరవ పైడిరాజు, బంగారు తులసీరామ్, ఎలమంచిలి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి బహిరంగ సభకు బైకు ర్యాలీ

ఆరిలోవ : ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పెందుర్తిలో జరిగే బహిరంగ సభకు టిడిపి అధినేత చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం సాయంత్రం బైకు ర్యాలీగా తరలి వెళ్లారు. ఆరిలోవ తోటగరువు నుంచి బాలాజీనగర్ మీదుగా బిఆర్‌టిఎస్ రోడ్డు ముడసర్లోవ రోడ్డు మీదుగా బైకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, మద్దిల రాజశేఖర్, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు, గాడి సత్యం, రాగతి అచ్చుతరావు, ఏడువాక సన్యాసిరావు, తురకపూడి బాలస్వామి పాల్గొన్నారు.

గోపాలపట్నంలో చంద్రబాబుకు ఘన స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

తరలిన 98వ వార్డు టిడిపి నాయకులు

సింహాచలం: ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు 98వ వార్డు టిడిపి కార్పొరేటర్ పివి.నరసింహ ఆధ్వర్యాన నాయకులు భారీగా తరలివెళ్లారు.

దోబీఘాట్లు కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- మాధవధార : విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులకు స్థలాలు, దోబీఘాట్లును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. కంచరపాలెం సిఐటియు కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులు 50 వేల మంది ఉన్నారని, స్థలాలు, దోబీఘాట్లు లేక అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్‌లో, ఇళ్లల్లో పనివారుగా చేస్తూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా రజకులకు మోడ్రన్ దోబీఘాట్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లాండ్రీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని, లాండ్రీలకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరుచేయాలని, మాధవధార, తెన్నేటినగర్, కంచరపాలెం, నరసింహనగర్, ఆర్‌పి. పేట, చాకలిగెడ్డ ప్రాంతాల్లో దోబీఘాట్లు నిర్మించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో రజక నాయకులు టి.రాము, పి.ఈశ్వరరావు, టి.సోమయ్య, జి.సత్యం, బి.రాము, జి.రామ్‌శెట్టి, కె.గోవిందరావు, ఎన్.అప్పన్న, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

రెహమాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఎ.రెహమాన్‌కు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం రెహమాన్ నివాసానికి శ్రీధర్ వెళ్లి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయటంలో అందరికీ తోడుగా ఉంటూ ముందుకు నడిపించాలని శ్రీధర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ, పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం ఇన్‌ఛార్జి సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : రెహమాన్ జన్మదిన వేడుకలను ఆయన స్వగృహంలో వైసిపి పార్టీ నాయకుల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. రెహమాన్ పేరిట ఏర్పాటుచేసిన కేకును కట్ చేసి, జన్మదిన వేడుకలకు శ్రీకారం చుట్టారు. అనంతరం రెహమాన్‌కు జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 91వ వార్డు వైసిపి అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షుడు గొర్ల అప్పలస్వామినాయుడు, నాయకులు గేదెల మురళీకృష్ణ, కంప సత్తిబాబు, గొంతున నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్ల సత్యనారాయణ పుష్పగుచ్ఛాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రెహమాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీధర్

గౌరీనగర్‌లో బస్టాప్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : కూర్మన్నపాలెం గౌరీనగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన బస్టాప్‌ను వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులు తులసి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాంత వాసులు ఎన్నో ఏళ్లుగా బస్టాప్ కోసం పోరాటం చేసినట్లు ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి రావడంతో ఆయన అధికారులను, ఎంపీ ఎంవివి.సత్యనారాయణను సంప్రదించి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపారు. వార్డులో ఇంకా పూర్తికాని పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లేళ్ళ కోటేశ్వరరావు, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, వైసిపి నాయకులు రోజారాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా విసిసి సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి జిఎ.కాలనీ విసిసి కమిటీ ఆధ్వర్యాన మల్కాపురం జోన్ కన్వీనర్ ఇ.అరుణ, ట్యూషన్ టీచర్ ఎస్.కృష్ణవేణి నేతృత్వంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ అరుణ మాట్లాడుతూ, పిల్లలను టీవీలకు, సెల్ ఫోన్లకు దూరంగా ఉంచేందుకు ఈ సమ్మర్ క్యాంపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. పిల్లలలో సృజనాత్మకత, నైపుణ్యం పెంపొందుతాయని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో అభ్యుదయ పాటలు, దేశచరిత్ర, కథలు, డాన్స్, జానపద నృత్యాలు, కాగితపు బొమ్మల తయారీ, మెజీషియన్, మ్యాజిక్ షో, భవిష్యత్ అంటే ఏమిటీ? ఏమి చదువుకోవాలి ఏలా చదవాలి? కుటుంబం అంటే ఏమిటి? సమానత్వం, సమసమాజం అంటే ఏమిటి?, మంచి అలవాట్లు, అభిరుచులు తెలిపేలా క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విసిసి సభ్యులు ఎం.సాయి, ఎన్.చైతన్య, డి.నిఖిల్, లక్ష్మీప్రసన్న, ప్రేమలత, జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.

దామెరకు నేడు 'చందు' పురస్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దామెర వెంకటసూర్యారావు 'చందు' పురస్కారానికి ఎంపికయ్యారు. చందు సాహితీ సాంస్కృతిక సంస్థ ఈ నెల 18న విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ వెంకట సూర్యారావుకు పురస్కారాన్ని అందిస్తారు. సాహితీ రత్నాకర, సాహిత్య వాచస్పతి, రచయిత, విశ్లేషకులు అయిన వెంకట సూర్యారావు భారతీయ విద్యా కేంద్ర (బివికె) కళాశాల తెలుగు విభాగాధిపతిగా సేవలందించారు. ఎనలేని సాహిత్యసేవ చేస్తున్న డాక్టర్ సూర్యారావును 2023 సంవత్సరానికి చందు పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆ సంస్థ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కార గ్రహీతకు రూ. 10 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ప్రతిష్టాత్మక చందు పురస్కారాన్ని 2017లో ప్రజాకవి వంగపండు ప్రసాదరావుకు, 2018లో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు, 2019లో ప్రముఖ కవి శిఖామణికి, 2021లో ప్రజా కవి గోరేటి వెంకన్నకు, 2022లో ఆచార్య సాతుపాటి ప్రసన్నశ్రీకి, అందజేసినట్లు అప్పలరాజు తెలియజేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై

స్పందించాల్సిన అవసరం లేదనడం హాస్యాస్పదం

◆ ప్రజల్లో పలు అనుమానాలు కలిగిస్తున్న తహశీల్దారు ప్రకటన

◆ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై స్పందించాల్సిన అవసరం లేదని దేవరాపల్లి తహశీల్దార్ బహిరంగంగా పత్రికా ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో అనేక ఆక్రమణలు జరుతున్నాయని, ప్రతిదానికీ స్పందించడం కష్టమని మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న తహశీల్దారు ప్రకటించడం ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడవలసిన వారే ఇటువంటి ప్రకటనలు చేయడం వల్ల ప్రజల్లో రెవెన్యూ అధికారుల పట్ల పూర్తిగా విశ్వాసం పోతుందని తెలిపారు. తహశీల్దారు ప్రకటన పలు అనుమానాలకు తావిస్తోందని, వెంటనే ప్రభుత్వ భూములు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టి ప్రజల్లో ఆ అనూమానాలను నివృత్తి చేయాలని కోరారు.

తారువ రెవెన్యూ సర్వే నెంబరు 179లో రెడ్డి వారి చెరువు, మరికొన్ని సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి అడ్డగోలుగా కబ్జా చేయడం, దేవరాపల్లి సర్వే నెంబరు 20లో 38 ఎకరాల ఆక్రమణపై కోర్టు తీర్పు ఇచ్చినా ఆ భూమిని స్వాధీనం చేసుకోకుండా అడ్డుపడటం, మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 115లో 23.15 ఎకరాల దేవుని భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మేయడం, దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబర్లు 280/1, 281/2లో అక్రమంగా ఫలసాయం పొందడం వంటి అంశాలపై ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడుకు తాను బహిరంగ లేఖ రాసినట్లు వెల్లడించారు. ఆక్రమణల భూములు స్వాధీనం చేసుకోవాలని, కోర్టు వివాదంలో ఉన్న భూముల్లో పంటలు వేయాడాన్ని నివారించడానికి అధికారులకు తగు ఆదేశాలు ఇవ్వాలని, లేకుంటే ఆక్రమణదారులకు మీరు, మీ ప్రభుత్వం కొమ్ము కాస్తున్నట్లు భావించవలసి వస్తుందని ఆ లేఖలో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఇంత స్పష్టంగా రాసిన లేఖపై స్పందించవలసిన అవసరం లేదంటున్నారంటే అధికార దుర్వినియోగానికి పాల్పుడినట్లు అర్థమవుతుందని తెలిపారు. పైఅంశాల్లో ఏ ఒక్కటైనా తప్పుడు ఆరోపణలు అని రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేసి రుజువు చేస్తే తనపై చర్యలు తీసుకోవచ్చని వెంకన్న స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకన్న

విద్యార్థులను సత్కరిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం తారువులో సత్కరించారు. శ్రీవిజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన తురువోలు గ్రామానికి చెందిన కె.అనూష హెచ్ఇసి గ్రూపులో 475/500 మార్కులు పొంది ఉమ్మడి విశాఖ జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించింది. అలాగే ఎంపీసీ గ్రూపులో హేమబిందు 460/470, కె.జయశ్రీ 460/470, జె.శరత్ సాయి 983/1000 సాధించినట్లు కరస్పాండెంట్ ఈర్లె గోవింద్ తెలిపారు. ఈ సందర్భంగా తారువలోని డిప్యూటీ సీఎం తన క్యాంప్ కార్యాలయంలో సదరు విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఈర్లె గోవింద్, డైరెక్టర్ బిజి,దామోదర్, చీడికాడ మండల నాయకలు లాలం జానకి రామ్ పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 20 జరగనున్న ఎంపిఆర్ఎస్ క్యాట్ -2023, ఏపీఆర్జేసీ, డిసి-2023 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఐడి, పుట్టిన తేదీ ఆధారంగా హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి 8వ తరగతి విద్యార్థులు https:// aprs.apcfss.in/ StudentLogin.do వెబ్‌సైట్ నుంచి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు https:// aprs.apcf-ss.in/ APRJCInter StudentLogin.do వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9866559617 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ కోత లేకుండా చూడాలని వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఒక పక్క లోవోల్టేజ్, మరో పక్క హైవోల్టేజ్, వేసవిలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏపీ ఈపీడీసీఎల్ జేఈ ధనలక్ష్మికి విడత పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయని, వడగాల్పులు వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వృద్ధులు, పసిపిల్లలు ఈ ఎండవేడికి తట్టుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో విద్యుత్ కోతలు విధించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం మంగళపురం సచివాలయం పరిధిలో బుధవారం వైఎస్ఆర్ కంటి వెలుగు ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు డాక్టర్ ఆర్ వెంకట్రావు ఆధ్వర్యంలో 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 10మందికి ఆపరేషన్ ఎంపిక కాగా, 25 మందికి కళ్లద్దాలు పంపిణీకి ఎంపికయ్యారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా మంగళ పురం సర్పంచ్ కంటే వెంకట పద్మ రేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎప్పుడూ నిర్వహించలేని ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాబురావు, వైద్య సిబ్బంది ఓ రమణమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సోలార్ ట్రాకింగ్ సిస్టం రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రస్తుత కాలంలో విద్యుత్ వినియోగం పెరగడం, వేసవిలో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో విద్యుత్ బిల్ తగ్గించడానికి డైట్ కళాశాల విద్యార్థినులు పి.గాయత్రి, ఎ.భాగ్య, ఎస్.పద్మ కృష్ణవేణి, ఎస్.సింధుష సోలార్ ట్రాకింగ్ సిస్టంను తయారు చేశారు. ఈ పరికరం సహాయంతో సూర్యరశ్మి నుంచి వచ్చే కాంతిని విద్యుత్‌గా మారే ప్రక్రియను రూపొందించారు. సూర్యరశ్మి దిశను బట్టి ఈ సోలార్ ట్రాకింగ్ సిస్టం పనిచేస్తుందని విద్యార్థులు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు గైడ్‌గా డాక్టర్ అంజనీ కుమార్ వ్యవహరించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు రూ.1000 ఖర్చు చేసినట్టు ప్రాజెక్టు ఇంజనీర్ బి శేషగిరిరావు తెలిపారు. హెచ్ఓడి డాక్టర్ పి.పూర్ణప్రియ ప్రోత్సాహంతో ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం, వైస్ ప్రిన్సిపల్ ఆర్ వైకుంఠరావు, కో ఆర్డినేటర్ సరిత, బిటి అర్చన అభినందించారు.

జిల్లా సమస్యలను విస్మరించిన అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనకాపల్లి జిల్లా సమస్యలను, అభివృద్ధిని విస్మరించి సొంత ప్రయోజనాల కోసం బిజీబిజీగా గడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అనకాపల్లి జిల్లా మెట్ట ప్రాంత రైతుల ప్రయోజనాల కోసం మండలంలోని సుందరయ్యపేటలో 100 ఎకరాల్లో ఉద్యానవన పరిశోధన స్థానం ఏర్పాటుకు నిధులు వెచ్చించగా, వైసిపి ప్రభుత్వం దీనిని ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గానికి తరలించారని, అయినా అమర్నాథ్ నోరు విప్పలేదని ఆరోపించారు. ఎన్నికలకు ముందు జిల్లాలో ఉన్న సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చి మొండి చెయ్యి చూపారని మండిపడ్డారు. శారదా నది గ్రోయిన్ల మరమ్మతులు చేయకపోవడం వల్ల వర్షపు నీరు వృథాగా పోతుందని తెలిపారు. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిని 300 పడకలకు అప్‌గ్రేడ్‌కు రూ.68 కోట్లు మంజూరు చేశామని ప్రకటించి నాలుగేళ్లయినా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి దాతలు అందించిన రూ.60 లక్షలు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ నెల 19న చంద్రబాబు దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఎన్‌సిసి క్యాంపులో పూజితకు స్వర్ణ పతకం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న నీరుకుండి పూజిత ఎన్‌సిసి క్యాంపులో స్వర్ణ పతకం సాధించింది. ఈ నెల 9 నుండి 13 వరకు చెన్నైలో జరిగిన బాస్కెట్ బాల్ కేటగిరీలో పతకం సాధించింది. అణు పరీక్ష నిర్వహించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా డిఆర్‌డిఓ నిర్వహించిన ఎన్‌సిసి క్యాంపులో పూజితకు ఈ గౌరవం దక్కింది. స్వర్ణ పతకం సాధించిన పూజితను ప్రశాంతి కళా విద్యాసంస్థల చైర్మన్ ధర్మారెడ్డి ప్రసాద్ అభినందించారు.

విద్యార్థులకు ప్రాక్టికల్స్ శిక్షణ ఇస్తున్న దృశ్యం, రాఘవేంద్ర ఐటిఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ

సాంకేతిక శిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

రాఘవేంద్ర ఐటిఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం సాంకేతిక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని రాఘవేంద్ర ఐటిఐ ప్రిన్సిపాల్ గంజి సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో 2008వ సంవత్సరంలో ఐటిఐని ప్రారంభించినట్లు చెప్పారు. తమ ఐటిఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు సంవత్సరాల శిక్షణ అనంతరం వందలాది మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ అందజేస్తున్నామన్నారు. తమ ఐటిఐ ప్రారంభించిన తర్వాత గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు. ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్ షిప్‌లు, వసతి దీవెన మంజూరు చేస్తుందని తెలిపారు. సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పదవ తరగతి తర్వాత విద్యార్థులు ఫిట్టర్, ఎలక్ట్రికల్‌లో సాంకేతిక శిక్షణ పొందినట్లయితే ప్రభుత్వ ఉద్యోగాలు, పలు కంపెనీలలో ఉద్యోగాలు పొందవచ్చని, స్వయం ఉపాధిని సైతం ఎంచుకునే అవకాశం ఉందని చెప్పారు. తమ కళాశాలలో ప్రతి ట్రేడ్‌లో 40 సీట్లు ఉన్నాయని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు సంప్రదించాలని కోరారు.

ఈదురు గాలులతో మామిడికి తీవ్ర నష్టం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మంగళవారం సాయంత్రం భారీ ఈదురు గాలులు విధ్వంసం సృష్టించాయి. గంట వ్యవధిలోనే మండలంలోని నాలుగు గ్రామాల్లో మామిడి పంటకు తీవ్ర నష్టం చేకూర్చాయి. మండలంలోని పాతవలస, మర్రివలస, శృంగవరం, గొట్లాం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వీచిన గాలుల వల్ల భారీ చెట్లు నేలమట్టమయ్యాయి. తోటల్లో నిండుగా ఉన్న మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి. మామిడి తోటల కొమ్మలు విరిగిపోయి దారులు మూసుకుపోయాయి. గంటలో జరిగిన ఇంతటి విధ్వంసం ఎప్పుడు చూడలేదని రైతులు తెలిపారు. నేల రాలిన మామిడి కాయలను సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడి బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం నాలుగు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. రెడ్డి అప్పలనాయుడు, బొంతపల్లి రామారావు, పటాన సూర్యకు చెందిన మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. వెంటనే నష్టపరిహారం ప్రకటించాలని ప్రభుత్వాన్ని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.

రాలిపోయిన మామిడి కాయలను చూపుతున్న రైతులు



ఫైలేరియా కిట్లు అందజేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్లు అందజేత

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోధకాలు వ్యాధితో బాధపడే బాధితులకు మార్బిడిటీ మేనేజ్మెంట్ కిట్లను డాక్టర్ అనిల్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. కాళ్లను శుభ్రపరచుకునేందుకు టబ్, మగ్గు, సోప్, ఆయింట్మెంట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఈ కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమా మహేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ను అరెస్టు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కొండూరు వీరాచారి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళా క్రీడాకారులపై లాఠీచార్జికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. మహిళలను వేధిస్తున్న బీజేపీ నాయకులను కాపాడుతున్న మోడీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. ప్రజా సంఘాల నాయకులు కోరిబిల్లి శంకర్, కోరిబిల్లి జగదీష్, లాయర్ గొర్లి వెంకటేశ్వర్లు, ఎస్ సత్యనారాయణ,మత్తుర్తి సూరిబాబు పాల్గొన్నారు.

ఆసరా డబ్బులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - పరవాడ : డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రుణమాఫీకి సంబంధించిన నిధులు తక్షణమే విడుదల చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆసరా సాయం కోసం పొదుపు సంఘాల మహిళలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. మార్చి 25న రుణమాఫీ సాయం విడుదలకు ముఖ్యమంత్రి మీటర్ నొక్కగా, నేటికీ ఆ డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అన్ని డ్వాక్రా గ్రూపులకు వైయస్సార్ ఆసరా వెంటనే ఇవ్వాలని, లేని పక్షంలో డ్వాక్రా మహిళలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : పోషక విలువలతో కూడిన, రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆలోచించాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.అరుణ అన్నారు. బుధవారం మండలంలోని ఏలాల కొత్తూరు, సుందరయ్యపేట గ్రామాలలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు సబ్సిడీపై 30 రకాలు విత్తనాలను అరుణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న వారికి లాభాలు వస్తున్నాయని గుర్తు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం సచివాలయం వద్ద సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, నాయకులు సూరాడ ముత్యాలరావు, పూజారి ముత్యాలు, సచివాలయం సిబ్బంది రామ్ కుమార్, దిలీప్ కుమార్, కృష్ణ, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత ముత్యాలు

బుద్ధిజంపై బర్మా శాస్త్రవేత్తల పరిశోధన

బొజ్జన్న కొండ వద్ద బర్మాకు చెందిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ బౌద్ధ ఆరామం బొజ్జన్న కొండకు బుద్ధిజంపై పరిశోధనకు బుధవారం బర్మా నుంచి పరిశోధనా శాస్త్రవేత్తలు వచ్చారు. ప్రధానంగా ఇక్కడున్న పురాతన హీనయాన, మహాయాన, వజ్రయాన వంటి ప్రధాన స్థూపాలతో పాటు అనేక ఆనవాళ్లను పరిశీలించారు. మయన్మార్లోని మత వ్యవహారాలు, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుండి అధికారిక ప్రతినిధి బృందం పర్యటన కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆంధ్ర ప్రదేశ్ తెలియజేసింది. ప్రముఖులకు తగిన వసతి కల్పించాలని అభ్యర్థించింది. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ న్యోమింట్ టున్, డైరెక్టర్ క్యామ్యో విన్, అసిస్టెంట్ డైరెక్టర్లు మన్ థిట్నైన్, టున్టున్ అయే, ఫియోప్యాకోకో, మే మయాట్నోకో మయన్మార్ నుండి వచ్చారు. ముందుగా విశాఖ వచ్చి అక్కడ గల తొట్లకొండ, బావికొండ, పావురాల కొండ తదితర ప్రాంతాలు సందర్శించిన అనంతరం అనకాపల్లి బొజ్జన్న కొండను పూర్తిగా పరిశీలించారు. పూర్వపు చరిత్ర కలిగిన ఆనవాళ్లను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి దాసు, కార్య నిర్వహణ అధికారి నవీన్, పీలా మహాదయా, గైడు పసుపులేటి రామకృష్ణ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరుకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి 82వ వార్డు శారదా నది ఒడ్డున ఉన్న అన్నమయ్య, శాంతి పార్కుల అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుండి నిధులు మంజూరు చేయాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతికి వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, యువజన విభాగం అధ్యక్షులు జాజుల రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పార్కులు పూర్తిగా శిథిలావస్థకు చేరినందున, వినియోగానికి, ఆహ్లాదానికి దూరంగా ఉన్నాయని, వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి నిధులను మంజూరు చేయాలని కోరారు.

వినతి పత్రం ఇస్తున్న జానకిరామరాజు, రమేష్

ఉద్యోగుల సమస్యలపై ఎంపీకి వినతి

అనకాపల్లి : ఏపీ జెఎసి అమరావతి మూడవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగుల వేదనను చెబుదాం అనే నినాదంతో బుధవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రతి నెలా 1వ తేదీకి జీతాలు, పింఛన్లు చెల్లించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఎ ఎరియర్స్ను విడుదల చేయాలని, 11వ పిఆర్సి కమిషన్ సిఫార్సు చేసిన పే స్కేల్ అమలు చేయాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు సిపిఎస్ను వెంటనే రద్దు చేసి ఓపిఎస్లోకి మార్చాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని, విఆర్ఎల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ఉద్యోగ సంఘాల నాయకులు సింగంపల్లి వాసు, డి.లోవరాజు, పి.వి.రత్నం, వై.శ్రీరామ్మూర్తి, టి.వెంకటరమణ, ఎంఎస్ఎస్.శివ, యు.దేవీ వరప్రసాద్, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో కార్మికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా యాజమాన్యాలు తగు జాగ్రత్తలు పాటించాలని కార్మిక శాఖ జిల్లా ఇన్ఛార్జి అధికారి పి.సువర్ణ ఒక ప్రకటనలో కోరారు. ఆయా సంస్థల్లో పనిగంటలు ఉదయం సాయంత్రం ఉండేలా చూడాలని, ప్రభుత్వ నియమాల ప్రకారం పీస్ రేటు చెల్లించాలని, పని ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించాలని, అత్యవసర ఐస్ ప్యాక్, వడదెబ్బ నియంత్రణ పదార్థాలను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, ఇతర మందులను కార్మికులకు అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య శాఖ సహకారంతో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అత్యధిక ఉష్ణోగ్రతల దగ్గర పనిచేసే కార్మికులకు కూలింగ్ సదుపాయం కల్పించాలని, వడదెబ్బ తగిలిన కార్మికులకు అంబులెన్స్, వడదెబ్బ నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచాలని, సాధారణ నియమావళిని అనుసరించి వైద్యం అందించాలని, కూల్ రూఫ్, విండ్ షాడో వంటి సహజ పద్ధతులను యజమానులు తమ పరిశ్రమలు అనుసరించాలని సూచించారు.

పల్సర్ బైక్ అపహరణ

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గోవాడ గ్రామంలో కొత్త పల్సర్ బైక్ అపహరణకు గురైంది. మంగళవారం రాత్రి శివాలయం ఎదురుగా నివాసముంటున్న బుదిరెడ్డ ప్రకాష్ తన కుమార్తె వివాహం ఈనెల 13న చేశారు. కొత్త అల్లుడికి కానుకగా పల్సర్ బైక్ కొని ఇచ్చారు. అల్లుడు అత్తవారింటికి కొత్త బైక్పై వచ్చి ఇంటి సమీపంలో రోడ్డు మీద ఉంచాడు. ఉదయం లేచి చూడగా బైక్ కనిపించలేదు. అర్ధరాత్రి సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఇద్దరు వ్యక్తులు వేరొక బైక్ చోరీ చేసేందుకు ప్రయత్నించగా మనుషులు సంచారంతో పరారై, ఈ బైక్ను అపహరించుకుపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

పశు సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-కోటపాడు : వేసవిలో పశువుల సంరక్షణపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి బైరాగి అన్నారు. మండలంలోని సింగన్నదొరపాలెం శివారు కే.అగ్రహారంలో పశువిజ్ఞాన బడి నిర్వహించి పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. సంపూర్ణ మిశ్రమ దాణా సబ్సిడీపై అందించడం జరుగుతుందని చెప్పారు. లింగ నిర్ధారణ వీర్యం ద్వారా కేవలం ఆడపిల్లలు పుట్టుట గూర్చి రైతులకు వివరించారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గుండాల వీధి సాయి నగర్లో రూ.7 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి సహకారాలతో తుమ్మపాల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పంచదార్ల కన్నారావు, వార్డు మెంబర్లు పొలమరశెట్టి కృష్ణ, తర్రా సత్యారావు, సత్యనారాయణ, నాయకులు కోటేశ్వరరావు, ఆడారి ప్రసాదు, ఆర్టీసీ సత్యనారాయణ, ఆర్డబ్ల్యుఎస్ జెఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -కశింకోట : రహదారి భద్రతపై మండలంలోని నర్సింగబిల్లి గ్రామంలో వెలుగు ఆధ్వర్యాన డ్వాక్రా మహిళలు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. భద్రత పాటిస్తే సుమాంజలి, లోపిస్తే భాష్పాంజలి, భద్రతను తెలుసుకో-బంధాన్ని పెంచుకో, నీ మీద నీ జీవితమే కాదు నీ కుటుంబ సభ్యుల జీవితాలు కూడా ఆధారపడి వంటి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాసరావు, బిసి శ్రీను, విఓఎ జోగిరత్నం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ సేవా రత్న అవార్డుకు బల్లా ఎంపిక

ప్రజాశక్తి- అనకాపల్లి : సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత జైల్ హెడ్ వార్డర్ బల్లా నాగభూషణం ప్రతిభ సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. విశాఖ క్రీడా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు పి.అడవిరాజు ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో ఈ నెల 21న ఈ అవార్డు అందజేస్తారని నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 సంవత్సరాలుగా తమ అసోసియేషన్ ద్వారా చేస్తున్న విశేష సేవలను, జైళ్ల శాఖలో 30 సంవత్సరాల పాటు పని చేసి జైల్లో ఖైదీల పరివర్తన, సంస్కరణలు, వారి కనీస సౌకర్యాల కొరకు, జీవిత ఖైదీల పిల్లల ఉన్నత చదువుల కొరకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

రహదారి ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్డు ఆక్రమణలు తొలగించాలని జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ సత్యనారాయణకు బుధవారం రైతులు వినతి పత్రం అందజేశారు. ముందుగా జీవీఎంసీ జోనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అనకాపల్లి- ఉమ్మలాడ జిఎన్టి రోడ్డుకు ఎడమవైపు మరిడిమాంబ గుడికి వెళ్లే తోవలో వున్న రోడ్డును ఆక్రమించి నివాస గృహాలు నిర్మాణం చేయడం వల్ల వ్యవసాయ భూములకు రాకపోకలు ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దీనిపై ఈ ఏడాది ఫిబ్రవరి 6న విన్నవించినా, స్పందనలో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ మాట్లాడుతూ సర్వే చేసి ఆక్రమణ తొలగించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. రైతు సంఘం నాయకులు భీశెట్టి కృష్ణ అప్పారావు, కొణతాల నూక అప్పారావు, కొణతాల చిన్న, పొలమరశెట్టి కుమార్, కాండ్రేగుల శీతారామ్ పాల్గొన్నారు.

వాసవి ట్రస్టు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి : వాసవి స్వయంసేవ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జివిఎంసి జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యాన ఏప్రిల్ 19 నుంచి రాజా ఆఫ్టికల్స్ కంటి ఆసుపత్రి వద్ద జరుగుతున్న మజ్జిగ, చెరుకు రసం, సోడాల చలివేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు జోనల్ కమిషనర్ను శాలువాతో, కన్యకా పరమేశ్వరి అమ్మవారి కండువాతో ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ చైర్మన్ బత్తుల గణపతి, ప్రతినిధులు కడిమిశెట్టి సతీష్, సుదురుపాటి తాతాజీ, కటకం లక్ష్మణరావు, శ్రీధరాల శ్యాంసుందర్, కొత్త గోపాలకృష్ణ, పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద స్థానిక సిఐ బి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బుధవారం వాహన తనిఖీ చేపట్టారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వాహనాలకు ఫైన్లు వేశారు. చోడవరం పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్తో కొంతమంది యువకులు రోడ్డుపై చక్కర్లు కొట్టడంతో పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో బైక్ ర్యాష్ డ్రైవింగ్పై నిఘా ఉంచి దొరికి వారికి కౌన్సిలింగ్ చేశారు. వారి తల్లిదండ్రులకు పిల్లలను సరైన మార్గంలో ఉంచాలని సూచించారు.

వాహనాలను, రికార్డులను తనిఖీ చేస్తున్న పోలీసులు

కలెక్టర్ సుడిగాలి పర్యటన

అధికారులపై తీరుపై అసంతృప్తి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని బికే పల్లి, ఎండపల్లి గ్రామాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పఠన్ శెట్టి సందర్శించారు. ప్రధానంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూ సర్వే లో భాగంగా రెండో విడత బికేపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందజేయాల్సిన 9(2) నోటీసులు సక్రమంగా సవివరంగా లేకపోవడం పట్ల సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. సర్వే పనితీరు, భూమి కొలతలు ఎక్కువ, తక్కువలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జగనన్న కాలనీ ఇల్లు నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది లబ్ధిదారులకు కేటాయించిన స్థలం గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో నిర్మించేందుకు ఎవరు ముందుకు రాలేదని పలువురు తెలిపారు. సొంత స్థలాలలో ఇల్లు నిర్మాణాలు చేసుకుంటున్నారని, కొంతమందికి ఇళ్ల స్థలాలు లేక నిర్మాణాలు చేపట్టలేదన్న విషయం కలెక్టర్ దృష్టికి గ్రామ నాయకులు తీసుకువెళ్లారు. గ్రామంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఇంటి స్థలాలు కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు, వేతనాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవోకు సూచించారు. అనంతరం ఆయన అంగన్వాడి కేంద్రాలను సందర్శించి చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహార వివరాలు, వసతి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మూడు అంగన్వాడీ భవనాలు అద్దె గదుల్లో కొనసాగుతున్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. గ్రామంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎండపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఔట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న లేఅవుట్పై సమగ్ర విచారణ చేపటతామన్నారు.

అనంతరం ఆయన స్థానిక విలేకరులతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు తొలి విడత 143 గ్రామాలకు సర్వే నిర్వహించగా, మలివిడత 220 గ్రామాలలో సర్వే చేపడుతునామని తెలిపారు. సర్వేలో చిన్న చిన్న పొరపాట్లు జరిగిన విషయం వాస్తవమేనని. మలివిడత అటువంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులందరికీ ఇల్లు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట జయరాం, తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, పిఆర్ ఇంజనీర్ వర్మ, హౌసింగ్ ఇంజనీరు జగదీశ్వరరావు, ఆర్‌బ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, గ్రామ సర్పంచ్ లింగన్న నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

రెవెన్యూ అధికారుల నోటీసులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో కొంగసింగి గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తికి 15 రోజుల్లో స్థలం ఖాళీ చేయాలంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి సర్వే నెంబర్ 13 లో ఇళ్ళ నిర్మాణం కోసం కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో కొంత స్థలం ఖాళీగా ఉండటంతో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గతంలో అప్పటి సర్పంచ్ చెల్లూరు సత్యనారాయణ, గ్రామస్తులు నిర్ణయించారు. ఈ స్థలాన్ని గ్రామానికి చెందిన శేషగిరిరావు అనే వ్యక్తి ఆక్రమణ చేసుకుని గ్రామస్తులు అధికారులు వద్దని చెబుతున్నప్పటికీ ఎని రేకుల షెడ్ నిర్మాణం చేశారు. ఆ స్థలాన్ని ఆక్రమణ తొలగించి ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించాలని మాజీ సర్పంచ్ చెల్లూరు సత్యనారాయణ స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేసి 15 రోజుల్లోగా స్థలాన్ని ఖాళీ చేయాలంటూ ఆక్రమణదారునికి నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారుడు ఖాళీ చేయని పక్షంలో అధికారులే తొలగిస్తామని నోటీసులో పేర్కొన్నట్టుగా రెవెన్యూ అధికారులు తెలిపారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం

నూతన పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండల వై ఎస్ ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపిఎం ఎన్ పార్వతిభాయి ఆధ్వర్యంలో మండల స్థాయి రైతు ఉత్పత్తి దారులు సహకార సంఘం ఏర్పాటు చేసారు. వీరితో ప్రమాణ స్వీకారం చేయించి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 15 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లను ఎన్నుకున్నారు. వీరిలో 5 గురును పాలక వర్గం సభ్యులుగా ఎంపిక చేశారు. రైతు ఉత్పత్తి సంఘాల ఉద్దేశం, కార్యక్రమాలపై ఏపీఎం పార్వతి భాయి వివరించారు. ఈ కార్యక్రమం లో మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు

గొలుగొండలో ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-గొలుగొండ: ఉపాధి కూలీలంతా తగినంత తాగునీరు తీసుకుంటూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఇన్చార్జ్ ఎంపీడీవో బివి సత్యనారాయణ అన్నారు. మండలంలో లింగం దొరపాలెం, కొత్త మల్లంపేట, లింగంపేట తదితర గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్ఆర్ఈజీఎస్ ఈసి రాధికతో కలిసి ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీలంతా ఉదయాన్నే పనులు ప్రారంభించి వడగాలులకు దూరంగా ఉండాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపేట సచివాలయ ఏఎన్ఎం ఉమా, ఆశా కార్యకర్తలు అచ్చితల్లి, మంగలక్ష్మి , వీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని ఉపమాక, నక్కపల్లి, న్యాయంపూడి, కాగిత గ్రామాల్లో ఉపాధి పనులను ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. మెడికల్ సిబ్బంది కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పని ప్రాంతంలో తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పని ప్రాంతంలో తప్పనిసరిగా తాగునీటిని అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు, ఉపాధి సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

.బుచ్చయ్యపేట : మండలంలోని బుచ్చయ్యపేట, నేతావానిపాలెం, దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సువర్ణ రాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలల్లో మంచినీటిని బిందులతో తెప్పించి ఏర్పాటు చేయించారు. ఉపాధి కూలీలు ఎండలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణం పేకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో మురళి, ఈసీ సతీష్, టిఏ లక్ష్మిరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు వరాహమూర్తి, కసవ నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపిడిఒ

వీధి కుళాయిల్లో కలుషిత నీరు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో బుధవారం వీధి కుళాయిల నుంచి కలుషితనీరు సరఫరా అయింది. గ్రామంలో మూడు రోజులుగా ప్రజలకు తాగునీరు అందించలేక పోతున్నారని మాజీ జెడ్పిటిసి చిటికల తారక వేణుగోపాల్ మంగళవారం విలేకరుల సమావేశంలో పంచాయతీ పాలకవర్గాన్ని అధికారులను దుయ్య బట్టారు. ఈ నేపథ్యంలో అధికారులు బుధవారం ప్రజలకు తాగునీరు అందించే ఏర్పాటు చేశారు. తాగునీటి కుళాయిల్లో కలుషిత నీరు రావడంపై మాజీ జెడ్పిటిసి అసహనం వ్యక్తం చేశారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసును వివరణ కోరగా పైప్ లైన్ మరమ్మతులు అయిన కారణంగా ముందుగా వేసిన కుళాయి ద్వారా కొంత కలుషిత నీరు వచ్చిందని, వెంటనే మంచినీరు వచ్చిందని ఆయన తెలిపారు.

కలుషిత నీరు

పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులకు వేట నిషేధ కాలానికి సంబంధించి ప్రభుత్వం మత్స్యకార భరోసా అందించడం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని రాజయ్యపేట గ్రామంలో జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ ఆధ్వర్యంలో మత్స్యకారులు ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వేట నిషేధ కాలానికి సంబంధించి మత్స్యకారుల ఖాతాలో 10 వేలు నగదు జమ చేయడం పట్ల మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

వీసంకు సత్కారం

ప్రజాశక్తి -నక్కపల్లి :ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ గా నక్కపల్లికి చెందిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ను ప్రభుత్వం నియమించింది .ఈ మేరకు బుధవారం పలువురు వైసిపి నేతలు వీసం రామకృష్ణను కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు పొడగట్ల పాపారావు, అయినంపూడి మణిరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, వెలగా ఈశ్వరావు, జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరపతిరావు, నాయకులు ఎల్లేటి సత్యనారాయణ, రోకళ్ళ శ్రీనివాసరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

నేడు మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలోని కొంగ సింగి గ్రామంలో మరిడిమాంబ పండగ ఈనెల 18న గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి సర్పంచ్ యలమంచిలి నూక రత్నం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని గ్రామ పెద్దలు, నిర్వాహకులు కోరారు.

ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక డిగ్రీ కళాశాల వద్ద స్కిల్ హబ్ లో డిగ్రీ అభ్యర్థులకు కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (డొమెస్టిక్ నాన్ వాయిస్- కంప్యూటర్స్), పదో తరగతి అర్హత కలిగిన వారికి ట్రైనీ బ్యూటీషియన్, ట్రెడిషనల్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్చార్జి కొర్రా శ్రీనివాస్ తెలిపారు. మూడునెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు ఫోన్: 9000092227లో సంప్రదించి ఇతర వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

కోతుల స్వైర విహారం

- బెంబేలెత్తుతున్న రైతులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు

రోడ్డుపై గుంపుగా ఉన్న కోతులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పలు గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుబడికి వచ్చిన మామిడి కాయలను పూర్తిగా నాశనం చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. కోతులు గుంపులుగా రావడంతోతో రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు బెంబేలెత్తి పోతున్నారు. గత కొంత కాలంగా నాగాపురం కృష్ణదేవి పేట, ఏఎల్ పురం, పాత మల్లంపేట, కొత్త ఎల్లవరం గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో పంటలతో పాటు ఇళ్ల మీదకు వచ్చి స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని రైతులు తెలిపారు. నాగాపురం, కృష్ణదేవిపేట గ్రామాల్లో విద్యార్థులు, రైతులపై కోతులు దాడులు చేసిన సంఘటనలు వున్నాయి. నాగాపురంలో గ్రామానికి సమీపంలో ఉన్న వంతెన వద్ద కోతుల కారణంగా ప్రజలు ఒంటరిగా ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు. ఏఎల్ పురం, కొత్త యల్లవరం గ్రామాల్లో నివాస గృహాల్లోకి చొరబడి చేతికిందని వస్తువులను కోతులు పట్టుకు పోతున్నాయి. దీంతో, ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రస్తుతం మామిడి తోటలలో ఉన్న మామిడి కాయలను, కొన్నిచోట్ల కూరగాయల పంటలను కోతులు పూర్తిగా నాశనం చేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజూ మామిడి కాయలను పూర్తిగా తిని వేయడంతో రైతులు ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో రైతులు నల్లటి ఆకారాలు కలిగిన దిష్టిబొమ్మలను వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి కోతుల బెడద ఉన్న గ్రామాల్లో పంజరాలు ఏర్పాటు చేసి వాటి బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.



ఇంటి పైకప్పు పై ఉన్న కోతుల గుంపు



ర్యాలీ చేస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ నక్కపల్లిలో బుధవారం సిఐటియు, ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు పేరుతో పెద్ద ఎత్తున పోరాడి 32 మంది బలిదానాలతో ఏర్పడిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం విక్రయించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. స్టీల్ ప్లాంట్‌కు స్వంత గనులు కేటాయించకుండా భారం మోపి నష్టాలు వచ్చేలా చేసి బంగారు బాతు వంటి స్టీల్ ప్లాంట్‌ను అమ్మడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ప్రాణాలైనా అర్పిస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరణ కానీయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, ఆనందరావు, లోవరాజు, నాగేశ్వరరావు, అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

దంపతుల ఉదారత

- సొంతంగా తాగునీరు సరఫరా

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయితీ కొత్తకోట లో ఇటీవల ఏర్పడిన తాగు నీటి ఎద్దడిని గుర్తించి గ్రామానికి చెందిన సోమిరెడ్డి రాజు - రామలక్ష్మి దంపుతులు స్పందించి కొత్తకోటలో కొన్ని ప్రాంతాలలో బుధవారం తమ సొంత ట్రాక్టర్ తో పాటు ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేశారు. దీంతో పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా స్థానిక రక్షిత పథకం మోటార్ మరమ్మతుకు గురి కావడంతో పలు వార్డులలో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. దీనిపై స్పందించిన రాజు దంపతులు తాగునీటి ఎద్దడి ఉన్న వార్డులలో తాగునీటి సరఫరా చేపట్టారు. పంచాయితీ పాలకులకు లేకపోయినా ఏ పదవి లేని వ్యక్తి తాగునీరు సరఫరా చేయడం పై ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ దంపతులను అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా కో కన్వీనర్ డిఎన్ఎస్ లక్ష్మీ, స్థానిక ప్రజలు శాలువాతో ఘనంగా సత్కరించారు.

యంత్రాన్ని ఇస్తున్న సర్పంచ్

గడ్డి కోత యంత్రం అందజేత

ప్రజాశక్తి- కోటవురట్ల:వైయస్సార్ యంత్రసేవా పథకంలో భాగంగా బుధవారం పి కొత్తపల్లిలో సర్పంచ్ ఎలగడ బెన్నమ్మ చేతుల మీదుగా 40శాతం సబ్సిడీపై గడ్డి కోత యంత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధనమ్మ మాట్లాడుతూ, లబ్ధిదారులకు అవసరమైన పనిముట్లు అందుబాటులో ఉన్నాయని సచివాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ లోకారపు బాబులు, వైసిపి నాయకులు జాగారపు శ్రీనివాస్, విహెచ్‌వి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు రకాల పోటీలు

కొత్తకోటలోని పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంకు బుధవారం జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు త్రిమూర్తులురెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారులతో దేశభక్తి గేయాల, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పాటలు పోటీలు నిర్వహించారు.పలువురు విద్యార్థులు దేశభక్తి గేయాలతో పాటు భక్తి గీతాలు జానపద గీతాలు ఆలపించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, గ్రంథాలయ అధికారి ఎన్. రాజబాబు పాల్గొన్నారు.

కొత్తకోట: శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తకము పఠనం, పేపర్ క్రాఫ్ట్ చేయించారు. వివిధ రకాల బొమ్మలను గీయించారు. ఈ కార్యక్రమం లో గ్రంథాలయాధికారి ఆర్.వరహమణి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకరరావు మాట్లాడుతూ, కథలలో ఉన్న నీతి పిల్లలకు వివరిస్తే ఆ ప్రభావం తప్పనిసరిగా ఉంటుందని వివరించారు. పిల్లలకు కథలు చెప్పి నీతిని బోధించారు. పిల్లలతో కథలు చదివించారు. ఇంగ్లీషు పదాలను ఉపయోగించి జంబిల్ గేమ్ ఆడించారు. గ్రంథాలయధికారిని పి. దమయంతి మాట్లాడుతూ, లైబ్రరీలతో ఉపయోగాలు, వాటి ఫలితాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు మాస్టారు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం ఆంగ్ల భాషపై అవగాహన కల్పించారు. అనకాపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంగ్ల భాష రాయటంతో పాటు చదవడం, మాట్లాడటంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహం, రాజేంద్రప్రసాద్, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండలో పాడుతున్న చిన్నారులు

ములగాడ: మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ప్రముఖ అంబేద్కరీయులు పి.సిద్ధార్థ పాల్గొని అంబేద్కర్ చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్షరాన్ని ఆయుధంగా చేసుకున్న అంబేద్కర్‌ను బాలలంతా అనుసరించాలని, విజ్ఞానాన్ని ఆర్జించాలని కోరారు. అనంతరం వేసవిలో పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సచివాలయ ఉద్యోగి మహేష్, వైద్య సిబ్బంది వివరించారు. ప్రాథమిక చికిత్స మందులను, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారులు కాగితాలతో పువ్వులను, బొకేలను, గ్రీటింగ్ కార్డులను తయారు చేసి ప్రదర్శించారు. వీటికి రిసోర్స్ పర్సన్స్‌గా వై.అనసూయాదేవి, లావణ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కె.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి సమన్వయం చేశారు.

శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -పాయకరావుపేట:ఈ నెల 8 నుండి 17 వరకు యస్‌ఆర్‌డిజి స్కూల్ (గాజువాక)లో నిర్వహించిన 13వ ఆంధ్రా బెటాలియన్ జూనియర్ బాలుర ఎన్‌సిసి శిక్షణ శిబిరంలో నిర్వహించిన ఖో ఖోలో స్థానిక శ్రీ ప్రకాష్ ఎన్ సి సి విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని ఏఎన్‌ఓ ఎండి ఇబ్రహీం తెలిపారు. ఈ పోటీల్లో రైఫిల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, కంపాస్ రీడింగ్, డ్రిల్ ప్రాక్టీస్, గన్ పార్ట్స్ మొదలైన వాటిలో శిక్షణ పొందారని ఆయన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివి ఎస్ఎస్ మూర్తి అభినందనలు తెలిపారు.

ప్రతిభ కనపరచిన విద్యార్థులు

రాజయ్యపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట లో బుధవారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టారు. ఎంపీడీవో సీతారామరాజు శానిటేషన్ పనులను పరిశీలించారు. .రోడ్డు పక్కన ఉన్న చెత్తను ప్రొక్లైన్‌తో తొలగించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సూచించారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

ప్రొక్లైన్‌తో తొలగిస్తున్న అధికారులు

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

బోరు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ బుధవారం మంచినీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ నిధులతో మంచినీటి బోరును వేయిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మోటూరు వారి వీధిలో మంచినీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు మెంబరు మోటూరు జ్యోతి, గ్రామ టిడిపి ప్రెసిడెంట్ మోటూరు రమణ పాల్గొన్నారు.